


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| గురువారం 19 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 290 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ ఏప్రిల్, మేలో రెండో విడత ప్రారంభం

### వచ్చే మూడేళ్లలో ప్రతి వార్డులో ఇళ్ల నిర్మాణం – మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి






సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఒకసారి చేసే కార్యక్రమం కాదని, ప్రతి సంవత్సరం కొనసాగించే శాశ్వత ప్రక్రియగా ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఆచరణలో చూపిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పట్టణ ప్రాంతాల ప్రతి వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. శాసన మండలిలో హౌసింగ్‌పై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మాట్లాడుతూ, ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తామని, ఇప్పటికే మొదటి విడత పూర్తయిన నేపథ్యంలో మిగిలిన విడతలను దశలవారీగా పూర్తి చేస్తామని చెప్పారు. మారుమూల గిరిజన తండాలు, గూడాల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని, లబ్ధిదారులకు అనుకూలంగా ఫ్లెక్సిబిలిటీ కల్పిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి వివక్ష ఉండదని, కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అత్యంత పేదలకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు తెలిసితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్చి నాటికి సుమారు లక్ష ఇళ్లు పూర్తవుతాయని, జూన్-జులై నాటికి మొదటి విడతలో మంజూరైన మూడు లక్షల ఇళ్లలో మెజారిటీ పూర్తి అవుతాయని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు దగ్గరలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గతంలో దూర ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్ల వినియోగ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే 2BHK పథకంలో పెండింగ్ బిల్లుల్లో 99 శాతం ఇప్పటికే చెల్లించామని, మిగిలినవి త్వరలో క్లియర్ చేస్తామని, ఆగిపోయిన ఇళ్లను పూర్తి చేసి అర్హులకు అందజేయడానికి 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.




## వరద మైదాన నియంత్రణ శిబిరానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీకారం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: రాష్ట్రంలో నదుల పునరుద్ధరణకు దిశానిర్దేశం చేసే కీలక కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రతీకాత్మకంగా శ్రీకారం చుట్టారు. సాంప్రదాయ కుండలో నీరు నింపుతూ నదుల పరిరక్షణకు సంకేతంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల సంస్థ మరియు కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పరిపాలనాభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన వరద మైదాన ప్రాంత నియంత్రణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నదుల పరిరక్షణ, వరద నియంత్రణ చర్యలు మరింత సమర్థవంతంగా అమలు కావాలని మంత్రి సూచించారు.

## రాష్ట్రంలో 2.35 లక్షల వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ – కొరత లేదని స్పష్టం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: రాష్ట్రంలో వంటగ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వెల్లడించింది. నిన్న రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2 లక్షల 35 వేల 678 వంటగ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసినట్లు తెలిపింది. వినియోగదారులు సిలిండర్ మళ్లీ నింపించుకోవడానికి ఆందోళన చెందవద్దని ప్రభుత్వం సూచించింది. పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షణ కోసం పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియంత్రణ కేంద్రంలో అధికారులతో పాటు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు కూడా పనిచేస్తున్నారు. ఈ మూడు సంస్థలు కలిపి సాధారణంగా రోజుకు 2 లక్షల 15 వేల 151 సిలిండర్లు సరఫరా చేస్తుండగా, నిన్న ఆ సంఖ్యను మించి పంపిణీ జరిగింది. అందులో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుంచి 93,887, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి 84,156, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి 57,635 సిలిండర్లు సరఫరా చేయడంతో మొత్తం 2 లక్షల 35 వేల 678 సిలిండర్లు వినియోగదారులకు అందాయి.

## మండలిలో పలు ప్రజా సమస్యలపై గళమెత్తిన తీన్మార్ మల్లన్న

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: శాసనమండలిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పలు ప్రజా సమస్యలపై గళమెత్తారు. ప్రజలు చదవడం తగ్గించిన పత్రికలకు ప్రకటనల రూపంలో భారీగా ఖర్చు చేయడం వల్ల ప్రయోజనం లేదని, డిజిటల్ మాధ్యమాలకు అనుగుణంగా ప్రభుత్వం విధానం రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో మూడు వేలకుపైగా వీఆర్‌ఏలకు ఇంకా నియామక పత్రాలు ఇవ్వలేదని, ఇప్పటికే వందలాది మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ వారికి న్యాయం చేయాలని, మధ్యవర్తి వ్యవస్థ వల్ల జీతాల్లో కోతలు పడుతున్నాయని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించే విధానం తీసుకురావాలని కోరారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా సభ దృష్టికి తీసుకెళ్లారు. బాలికల కోసం కేటాయించిన నిధులు ఖర్చు చేయకపోవడం, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ ఉప ప్రణాళికపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభ అనుమతి లేకుండా నిధుల వినియోగంపై విచారణ జరపాలని, ప్రజల డబ్బును బాధ్యతతో ఖర్చు చేయాలని పేర్కొన్నారు. నిజాలు చెబితే మైక్ ఆఫ్ చేయడం సరైంది కాదని, ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాల్సిందేనని హెచ్చరించారు.



## దేశాభివృద్ధికి పలు కీలక నిర్ణయాలు ప్రధాని మోదీ

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 19, ప్రతినిధి: దేశ అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలు అమలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అసోంలో టీ తెగల పిల్లలకు ఉచిత, నాణ్యమైన నివాస విద్య అందించేందుకు ఏకలవ్య నమూనా పాఠశాలలను విస్తరించడం ద్వారా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా రంగానికి ప్రోత్సాహం అందించే లక్ష్యంతో క్రీడా మంత్రిత్వ శాఖ బడ్జెట్‌ను రికార్డు స్థాయిలో పెంచినట్లు పేర్కొన్నారు. డిజిటల్ భారతంలో భాగంగా యూపీఐ లావాదేవీలు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నాయని, దేశ ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ చెల్లింపులు కీలక పాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. ఇండియా పోస్టు ద్వారా వేగవంతమైన తపాలా సేవలను ప్రారంభించి ప్రజలకు మరింత సౌలభ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే చిన్న జలవిద్యుత్ అభివృద్ధి పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపి, 2026–27 నుంచి 2030–31 వరకు 1500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఈ చర్యలు దోహదపడతాయని ప్రధాని అన్నారు.

## జర్నలిస్టులకు భద్రత, సమాన హక్కులు కల్పించాలి: తీన్మార్ మల్లన్న


సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: రాష్ట్రంలో నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులను కట్టడి చేయాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. జర్నలిస్టులతో పాటు న్యాయవాదులు కూడా గతంలో రోడ్లపై హత్యకు గురైన ఘటనలు ఉన్నాయని గుర్తు చేస్తూ వారందరికీ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం ప్రజలు పత్రికలను నేరుగా చదివే సంఖ్య తగ్గి డిజిటల్ మాధ్యమాల వైపు మొగ్గు చూపుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం డిజిటల్ మాధ్యమాల విధానాన్ని తీసుకురావాలని సూచించారు. జర్నలిజం అంటే కేవలం క్షేత్రస్థాయిలో పనిచేసేవారికే కాకుండా కార్యాలయాల్లో కూర్చొని వార్తలను అందించే వారికి కూడా సమాన బాధ్యత ఉందని పేర్కొన్నారు. డెస్క్ జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తూ, ఫీల్డ్, డెస్క్ అంటూ జర్నలిస్టులను విభజించకుండా అందరికీ సమానంగా గుర్తింపు కల్పించాలని కోరారు. కేవలం గుర్తింపు కార్డులతోనే జర్నలిస్టుల జీవితం మారదని, వారి సామాజిక గౌరవం, ఉద్యోగ భద్రత, ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు వదిలేసిన పత్రికలకు ప్రకటనల రూపంలో భారీగా ఖర్చు చేయడం వల్ల ప్రయోజనం లేదని, డిజిటల్ మాధ్యమాలను ప్రోత్సహించే విధంగా విధానాలు రూపొందించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## మూసీ సుందరీకరణపై అనుమానాలు – సభలో డీపీఆర్ పెట్టాలని కేటీఆర్ డిమాండ్




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో అసెంబ్లీలో మంత్రి చెప్పగా, ఇప్పుడు కేవలం రెండు నెలల్లోనే డీపీఆర్ సిద్ధమైందని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. విదేశాల్లో నిషేధం ఎదుర్కొన్న సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే ఆ డీపీఆర్‌ను సభలో పెట్టాలని డిమాండ్ చేశారు. మూసీ అభివృద్ధి పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ, దీనికి నిరసనగా తమ పార్టీ సభ నుంచి వాకౌట్ చేసినట్లు తెలిపారు. బఫర్ జోన్ పేరుతో దూర ప్రాంతాలకు నోటీసులు ఇవ్వడం, వేలాది ఇళ్లకు కూల్చివేత నోటీసులు పంపడం అన్యాయమని విమర్శించారు. ప్రాజెక్టు వ్యయం, దశలు, ఇళ్ల కూల్చివేతలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కాటమరాజు తిరునాళ్లకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, అమరావతి, మార్చి 19, ప్రతినిధి: ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం గుండంచర్లలో జరుగుతున్న శ్రీ గంగా భవాని సమేత వేణుతల కాటమరాజు తిరునాళ్ల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర తిరునాళ్లను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తూ, శ్రీ వేణుతల కాటమరాజు వారి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని

# రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రేపటి నుంచి శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని సీఎం అభిలషించారు. గత సంవత్సరం ఉగాది సందర్భంగా రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని గుర్తు చేస్తూ, ఈ ఏడాదిలో తెలంగాణ అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను ఆనందంగా జరుపుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి





సందేశం టైమ్స్, అమరావతి, మార్చి 19, ప్రతినిధి: శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనం, వసంతకాల ఆగమనం, భావి జీవితంపై ఆశలను రేకెత్తించే ఈ ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. ప్రతి ఒక్కరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరి జీవన సాఫల్యం సిద్ధించాలని తెలిపారు. పేదరికం లేని సమ సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం చేపడుతున్న పీ4తో పాటు వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' లక్ష్యాలను సాధిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లో ఘనంగా నంది పురస్కార వేడుకలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: ఉగాది పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో మయూరి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది నంది పురస్కార వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపియుఎస్ మండల అధ్యక్షులు అబ్బు అలీ ఖురేషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కవి, గాయకుడు పి.వి. భైరవన్ శర్మ, యాంకర్ ఎమ్.ఈ. భారతి, వేద పండితులు బోనాల ప్రశాంత్ శర్మ, ధూళిపాల లోకేశ్వర శాస్త్రి, ధూళిపాల సుబ్రమణ్యం, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్, ఆర్జె రాజేశ్వర్, 27/7 న్యూస్ చానల్ సీఈఓ అరుణ్ కుమార్, వేద పండితులు రాజేశ్వర శర్మ, కార్తీక్ శర్మ, కూచిపూడి నర్తకి సాయి ప్రియ తదితరులు తమ సేవలకు గుర్తింపుగా నంది పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, బిగ్‌బాస్ ఫేమ్ దువ్వాడ మాధురి, ఇండియన్ చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్, డేవిడ్ రాజు, సినీ నటి రాజన్న మూవీ నటీనటులు పాల్గొన్నారు. మయూరి ఆర్ట్స్ ఫౌండర్ రాధ, సిద్ధు, అమ్ము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుక కళా, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహాన్ని అందిస్తూ విజయవంతంగా నిలిచింది.



# ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

సందేశం టైమ్స్, అమరావతి, మార్చి 19, ప్రతినిధి: ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ పండుగల్లో అర్థం, పరమార్థం నిబిడీకృతమై ఉంటాయని, కుటుంబ ప్రేమానురాగాలు, ప్రకృతి ఆరాధన కలగలసిన విశిష్టత మన పండుగల్లో కనిపిస్తుందని పేర్కొన్నారు. తెలుగువారి తొలి పండుగగా, ముఖ్యమైన పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. వసంత ఋతువు ఆగమనంతో వచ్చే ఈ పండుగను మహారాష్ట్రలో గుడి పాడ్వా, కర్ణాటకలో యుగాది, సింధీ సమాజంలో చెటి చంద్, కాశ్మీరీ పండితులు నవ్రెహ్, మణిపూర్‌లో సజిబు నోంగ్మా పాన్‌బాగా జరుపుకుంటారని వివరించారు. ఈ ఏడాది పరాభవ నామ సంవత్సరంగా ప్రారంభమవుతుందని, పరాభవానికి దారి తీసే పనులు చేయకుండా పెద్దల మాటలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఈ ఉగాది తెలుగు ప్రజలందరికీ ఆరోగ్యం, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.



# 22న నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం రైతు ఉత్సవాలకు ముస్తాబు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: రాష్ట్ర సిగలో మరో మణిహారంగా నిలిచే నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఈ నెల 22న ఘనంగా ప్రారంభం కానుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే రైతు ఉత్సవాల కోసం నర్మెట్ట కర్మాగార ప్రాంతం ముస్తాబు అవుతోంది. ఉగాది పర్వదినాన సాయంత్రం 4 గంటలకు ప్రదర్శన శాలలను ప్రారంభించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా ప్రజాప్రతినిధులందరికీ ఇప్పటికే ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు. ఈ రైతు మహోత్సవంలో వ్యవసాయం, పశుసంవర్ధక, అనుబంధ రంగాలకు సంబంధించిన మొత్తం 150 ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ప్రారంభ సంస్థలు మరియు ప్రైవేట్ సంస్థలు తమ ఆధునిక సాంకేతికతలు, సేవలను రైతులకు పరిచయం చేయనున్నాయి. రైతులు నిపుణులు, శాస్త్రవేత్తలతో నేరుగా చర్చించే ప్రత్యేక వేదిక కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ ఉత్సవం ఈ నెల 22 వరకు కొనసాగుతుండగా, ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వివిధ శాఖల శాస్త్రవేత్తలు, అధికారులు, అభ్యుదయ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించబడతాయి. అదే రోజున ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించి రైతులకు అంకితం చేయడంతో పాటు 80 కోట్ల రూపాయలతో నిర్మించే రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ వేదికపై నుంచి రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. నర్మెట్టలో ప్రారంభమవుతున్న ఈ కర్మాగారం రైతులకు మైలురాయిగా నిలిచి, రవాణా ఖర్చులు తగ్గి ఆదాయం పెరగడానికి దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. కేంద్రం సహకారం లేకపోయినా గత ఖరీఫ్‌లో మొక్కజొన్న కొనుగోళ్లు చేసినట్లు, ఈ యాసంగిలో కూడా కొనుగోళ్లు కొనసాగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

# పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు – కొత్త ఆశలతో ముందుకు సాగుదాం : డా. జితేందర్ రావు తనుగుల



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా హిందూ బంధువులందరికీ టీవైజెఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు డా. జితేందర్ రావు తనుగుల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ కొత్త ఆశలు, ఆకాంక్షలు, ఉత్సాహంతో ముందుకు సాగుతూ తమ లక్ష్యాలను విజయవంతంగా సాధించాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడి జీవితం లోని తీపి, చేదు, పులుపు అనుభవాలను సమానంగా స్వీకరించాలని సూచిస్తూ ప్రతి కుటుంబం ఆయురోగ్యాలు, ఐశ్వర్యాలతో సర్వతోముఖ అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు. ఉగాది పండుగ తెలుగు ప్రజల తొలి పండుగగా కొత్త సంవత్సరానికి నాంది పలుకుతూ పంచాంగ శ్రవణం ద్వారా భవిష్యత్ మార్గదర్శకత్వాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ శుభదినం ప్రతి ఇంట సిరిసంపదలు నింపాలని, ఆనందం, శాంతి నెలకొనాలని మనసారా ఆకాంక్షించారు.


# పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు – సుఖసంతోషాలతో ముందుకు సాగాలి : జయమ్మ మాతాజీ




సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 19, ప్రతినిధి: పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా హిందూ బంధువులందరికీ జయమ్మ మాతాజీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆశలు, ఆకాంక్షలు, సరికొత్త ఉత్సాహంతో ప్రారంభమవుతున్న ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ అనుకున్న లక్ష్యాలను విజయవంతంగా సాధించాలని ఆమె ఆకాంక్షించారు. వసంత ఋతువులో విరిసే పూలలాంటి ఆనందాలు, ఉగాది పచ్చడిలాంటి తీపి, చేదు, పులుపు అనుభవాలు జీవితాన్ని సంపూర్ణం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆయురోగ్యాలు, ఐశ్వర్యాలతో సర్వతోముఖ అభివృద్ధి సాధించాలని కోరుతూ, కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ ఆనందంగా జీవించాలని సూచించారు. ఉగాది పండుగ తెలుగు ప్రజలకు కొత్త సంవత్సరానికి నాంది పలుకుతూ పంచాంగ శ్రవణం ద్వారా భవిష్యత్ దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఈ శుభదినం ప్రతి ఇంట సిరిసంపదలు నింపాలని, శాంతి, సౌఖ్యాలు కలగాలని మనసారా కోరుకున్నారు.

# ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా తార ప్రభుత్వ కళాశాలలో విత్తన బంతులపై అవగాహన




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 19, ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలోని తార ప్రభుత్వ కళాశాలలో ఈకో క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విత్తన బంతులు (సీడ్ బాల్స్) తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన బంతుల తయారీ విధానం, వాటి వినియోగం మరియు పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. విత్తన బంతుల ద్వారా మొక్కల పెంపకాన్ని సులభంగా విస్తరించవచ్చని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. ప్రవీణ విద్యార్థులను ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఈకో క్లబ్ కన్వీనర్ డా. బి. సోఫియా రాణి ఆధ్వర్యంలో నిర్వహించగా క్లబ్ సభ్యులు మరియు 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




## సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 'కార్నివాల్ సెలబ్రేషన్-2026' ఘనంగా నిర్వహణ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 19, ప్రతినిధి: సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో 'కార్నివాల్ సెలబ్రేషన్-2026' కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి దేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, పాటలు, నాటికలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాల పెంపొందనకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్నివాల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వినోద కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగం హెచ్‌ఓడి వి. ఇందిరా ప్రియదర్శిని, జనరల్ సెక్షన్ హెచ్‌ఓడి డాక్టర్ ఎస్.ఎన్. పద్మావతి, ఈసీఈ ఇంచార్జ్ హెచ్‌ఓడి ఏ. విద్యాసాగర్, లైబ్రేరియన్ వెంకట్ రెడ్డి, బి. శ్రీనివాస్ గౌడ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ పి. ప్రావీణ్య


సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్, ఇంటింటి సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన బిఎల్‌ఓలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పటాన్చెరువు, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాలకు చెందిన ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బిఎల్‌ఓలు, సూపర్వైజర్లతో వీడియో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి బిఎల్ఓ తన పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి నిజమైన ఓటర్లను గుర్తిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వానికి ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతో కీలకమని, ఇందులో బిఎల్‌ఓలు సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బిఎల్‌ఓలను తప్పనిసరిగా నియమించాలని, ఖాళీగా ఉన్న చోట వెంటనే భర్తీ చేయాలని ఈఆర్‌ఓలకు ఆదేశించారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 13 కేటగిరీలలో బిఎల్‌ఓలను నియమించుకోవచ్చని, వారి వివరాలను ఈసీఐ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. అలాగే ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీవో రాజేందర్, ఎన్నికల విభాగం సెక్షన్ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ఎస్సీ అభివృద్ధి పథకాల అమలులో బ్యాంకులు పూర్తి సహకారం అందించాలి: అడిషనల్ కలెక్టర్ పాండు




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల స్వయం ఉపాధి పథకాల కింద లబ్ధిదారులకు బ్యాంకులు వేగంగా రుణాలు మంజూరు చేసి పూర్తి సహకారం అందించాలని అడిషనల్ కలెక్టర్ పాండు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన తెలిపారు, తెలంగాణ ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి అమలు చేస్తున్న ఎస్సీ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాకు కేటాయించిన యూనిట్లను సమయానికి అమలు చేయాలని. ప్రభుత్వం సబ్సిడీతో అమలు చేస్తున్న ఈ పథకాలపై బ్యాంకులు సానుకూల దృక్పథంతో స్పందించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ఎంపికైన వారికి బ్యాంకులు త్వరితగతిన కాన్సెంట్ ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. పథకాల అమలులో ఎటువంటి ఆలస్యం లేకుండా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం ఘనంగా జరుపుకుందాం - ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు




సందేశం టైమ్స్, వట్పల్లి, మార్చి 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రంలోని మెడికుందా గ్రామంలో తెలుగు సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు పిలుపునిచ్చారు. ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త ఆరంభాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రజలు ఆనందోత్సాహాలతో ఇళ్లను శుభ్రపరుచుకుని మామిడి తోరణాలు కట్టి ఉగాది పచ్చడిని తయారు చేసి సాంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నెలకొని, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందాలని ఆకాంక్షిస్తూ ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సంస్కృతిని కాపాడుకోవాలని సూచించారు. "శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం నింపాలని, ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, అభివృద్ధి కలగాలని దేవుని ప్రార్థిస్తున్నాను. ఈ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు నెరవేరాలని కోరుకుంటున్నాను" అని కాచూర్ రావు అన్నారు.



## అకాల వర్షంతో నేలమట్టమైన జొన్న పంట - రైతుల ఆవేదన, ప్రభుత్వ సహాయం కోరుతూ విజ్ఞప్తి

సందేశం టైమ్స్, వట్పల్లి, మార్చి 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ మర్వేల్లి గ్రామానికి చెందిన మన్నే జగదీశ్వర్ రెండు ఎకరాలలో వేసిన జొన్న పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో అకాల వర్షాల దెబ్బకు నేలమట్టమై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి వచ్చిన పంట వానగన్న దెబ్బలకు పూర్తిగా నాశనం కావడంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. అప్పులు చేసి సాగు చేసిన రైతులు ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులతో లబోదిబోమంటున్నారు. పంట నష్టంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని, తమ బాధలు చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించాలని, పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఖాదిరాబాద్ గ్రామంలో ఈద్ కా తోఫా పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 19, ప్రతినిధి: అందోల్ నియోజకవర్గంలోని వట్పల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామంలో మైనార్టీ ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ పండుగ సందర్భంగా "ఈద్ కా తోఫా" పంపిణీ చేయబడింది. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు దామోదర రాజనర్సింహ గారి ఆదేశానుసారం వట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రతాప్ రమేష్ జోషి మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మన్నె ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖాదిరాబాద్ గ్రామ సర్పంచ్ మన్నె ఇందిరా ఈశ్వరయ్య, ఉప సర్పంచ్ బుక్క బిక్కుసాబ్, సెక్రెటరీ మల్లేశం, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నే పోచయ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 19, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామ ప్రజలకు వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నే పోచయ్య ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగాది తెలుగు ప్రజల ఆత్మీయత, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటికి కొత్త ఆశలు, ఆనందాలు తీసుకువస్తుందని, ఉగాది పచ్చడి జీవితం లోని తీపి, చేదు, పులుపు అనుభవాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో నిండాలని, ప్రజలు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పండుగను ఆనందంగా జరుపుకోవాలని, ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు, అభివృద్ధి, శ్రేయస్సు తీసుకురావాలని కోరారు.

## పటాన్చెరువు రుద్రారం వద్ద కారు ఢీకొట్టిన ఆటో: డ్రైవర్ తల కు గాయాలు






సందేశం టైమ్స్, పటాన్చెరువు, మార్చి 19, ప్రతినిధి: పటాన్చెరువు మండల్ రుద్రారం దగ్గర ఇస్నాపూర్ నుండి వెళుతున్న ఆటో (AP 23 Y6954) ను వెనుక నుండి కారు (TS 13-EL1180) ఢీకొట్టింది. ఆటో రోడ్డు పక్కన రోడ్డు మరమ్మత్తులు చేస్తున్న రూలర్ ను ఢీకొట్టడంతో ఆటోకు భారీ డ్యామేజ్ ఏర్పడ్డింది. ఆటోలో ఉన్న డ్రైవర్ తల పగిలి గాయపడ్డాడు, ప్రస్తుతం చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. కారు డ్రైవర్ మానవతా దృక్పథంతో అతనిని హాస్పిటల్ కు తరలించమని, ఆటోకు జరిగిన నష్టాన్ని కూడా భర్తీ చేయమని ఒప్పుకున్నారు.

# పటాన్చెరువు పట్టణంలో రంజాన్ తోఫా పంపిణీ చేసిన మాద్రి పృథ్వీరాజ్





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 19, ప్రతినిధి: పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని పటాన్చెరువు పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, నాగులమ్మ గడ్డ, రాఘవేంద్ర కాలనీ, సారాయి, భకత్ గల్లి, వెంకటేశ్వర కాలనీలలో నివసిస్తున్న పేద ముస్లిం మహిళలకు రంజాన్ కిట్లు పంపిణీ చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీ మాద్రి పృథ్వీరాజ్ గారు. గత 8 సంవత్సరాలుగా MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో, MDR ఫౌండేషన్ కార్యాలయంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తూ, పండుగల సందర్భంలో పేదల ముఖాల్లో ఆనందం నింపుతున్నారు. దసరా, క్రిస్మస్, రంజాన్ వంటి పర్వదినాలను కులమతాలకు అతీతంగా జరుపుకుంటూ, సమాజంలో ఐక్యతను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. "పండుగ అంటే కేవలం ఆనందం మాత్రమే కాదు, అవసరంలో ఉన్నవారితో ఆ ఆనందాన్ని పంచుకోవడం నిజమైన పండుగ" అని ఆయన తెలిపారు. ప్రజల కోసం, ప్రజల మధ్యలో ఉండే ఈ సేవా కార్యక్రమాలకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేవలో ముందుండే నాయకత్వం – సమాజానికి ఆదర్శం.

# సూర్యాపేటలో అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్లు రిజిస్ట్రేషన్ తప్పనిసరి: డాక్టర్ పెండెం వెంకటరమణ

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 19, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఎక్స్-రే సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు, ఆయుర్వేద, హోమియోపతి, యునాని, న్యాచురపతి, ఫిజియోథెరపీ మరియు ఇతర సేవలందించే ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ తెలిపారు. అన్ని ప్రైవేట్ సంస్థలు తెలంగాణా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం 2010, రూల్స్ 2022 ప్రకారం రిజిస్ట్రేషన్ పొందాలి. రిజిస్ట్రేషన్ లేకుండా ప్రాక్టీస్ చేయడం చట్టరిత్యా నేరం, అలాగే రిజిస్ట్రేషన్ లేకుండా కార్యకలాపాలు నిర్వహించే ఏవైనా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన హెచ్చరించారు. గడువు ముగిసిన సంస్థలు తప్పనిసరిగా రీన్యువల్ కోసం అప్లై చేయాలని, లేకపోతే చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవబడతాయని స్పష్టం చేశారు.

# ఎస్సీ యువతీ, యువకులకు రాయితీపై ఎలక్ట్రానిక్ వాహనాలు, వ్యవసాయ పరికరాలు – దరఖాస్తులు మార్చి 24వ తేదీకి



సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 19, ప్రతినిధి: షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం 2025–26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై ఎలక్ట్రానిక్ వాహనాలు, వ్యవసాయ పరికరాలను అందిస్తోంది. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు, ఈ పథకాల ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ రంగానికి 193 ఈవీ ద్విచక్ర వాహనాలు, 95 త్రీవీలర్‌లు, సోలార్ యూనివర్సల్ కంట్రోల్ యూనిట్లు 20 యూనిట్లు, శిక్షణా రంగంలో 77 వెజ్ ఎంప్లాయ్మెంట్ నైపుణ్యత అభివృద్ధి యూనిట్లు, 19 సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ యూనిట్లు మంజూరు చేయబడ్డాయి. అన్ని యూనిట్లకు 60–100% రాయితీ, కొన్ని యూనిట్లకు బ్యాంక్ లోన్ కలిగి ఉంటుంది. దరఖాస్తులు https://tgobmms.cgg.gov.in/� వెబ్సైట్ ద్వారా మార్చి 24వ తేదీకి ఆన్‌లైన్‌లో చేయవలసినవి. వీటికి సబ్సిడీ పొందడానికి తెల్లరేషన్ కార్డు, వార్షిక ఆదాయం, వయసు, డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ భూమి వంటి ధృవ పత్రాలు అవసరం. ముఖ్యంగా ఈవీ ద్విచక్ర వాహనాల యూనిట్లను ఊబర్, రాపిడో, జొమాటో, స్విగ్గీ సేవలందిస్తున్న వారు ప్రాధాన్యత పొందుతారు. దరఖాస్తులను ఆర్జీదారుడు డౌన్‌లోడ్ చేసి, కలెక్టర్ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, కార్యనిర్వాహక సంచాలకులు దయామణి, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి జయప్రకాశ్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏ.డి. అశోక్, వ్యవసాయ శాఖ ప్రణవి తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రకటన జిల్లా పౌర సంబంధాల అధికారి సూర్యాపేట వారిచే జారీ చేయబడింది.




# పర్యావరణ పరిరక్షణపై అవగాహన-శిక్షణ కార్యక్రమం – వి.సి. కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థుల స్టడీ టూర్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 19, ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడానికి రాయనిగూడెం వి.సి. కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, వి.సి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థుల కోసం ఘన శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ రోజు (మార్చి 18, 2026) సూర్యాపేట మండలంలోని కాసరాబాద్ గ్రామ పంచాయతిలో తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ క్షేత్ర పర్యటనలో భాగంగా ఘన వ్యర్థాలను వేరు చేయడం, కంపోస్టు ఎరువు తయారీ విధానం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, ఫికల్ స్లడ్జ్ మేనేజ్మెంట్ తదితర అంశాలపై అవగాహన-శిక్షణ ఇచ్చారు. T.N.G.C కోఆర్డినేటర్ సూర్య కిరణ్, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ నరేందర్ రెడ్డి మరియు కన్సల్టెంట్ ఆర్. హరి విద్యార్థులకు వివరించారు, ఇంటి స్థాయిలో తడి-పొడి చెత్త వేరు చేసి పర్యావరణ పరిరక్షణలో తమ బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో యం.పి.ఓ. Y. లింగా రెడ్డి, గ్రామ సర్పంచ్ గోవింద రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్, కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉగాది పండుగ శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 19, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు, ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలకు శ్రీకారం చుట్టే శుభదినమని, ప్రతి ఒక్కరూ సంతోషంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని, జిల్లా అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పండుగ వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ పరిశుభ్రమైన వాతావరణంలో ఉగాది వేడుకలు జరుపుకోవాలని కూడా సూచించారు. ఈ ఉగాది ప్రతి ఒక్కరికి శాంతి, సమృద్ధి, సుఖసంతోషాలను తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రకటన జిల్లా పౌర సంబంధాల అధికారి సూర్యాపేట వారిచే జారీ చేయబడింది.



# రాష్ట్ర ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు – మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: ఉగాది తెలుగు సంవత్సరారంభాన్ని సూచించే ముఖ్యమైన పండుగ అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇది కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన సమయమని తెలిపారు. ఈ సందర్భంగా రైతాంగానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సంవత్సరం సమృద్ధిగా పంటలు పండాలని, రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, అన్ని వర్గాల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# ఎస్సీ యువతి-యువకులకు స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం – సూర్యాపేట జిల్లా

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 19, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీ. తేజస్ నంద్ లాల్ పవార్, ఐ.ఏ.యస్., ఆర్ట్.డి.ఏ కార్యాలయం, సూర్యాపేట ద్వారా ప్రకటించిన ప్రకారం, షెడ్యూల్డ్ కులాల 2025–26 ఆర్థిక సంవత్సరపు స్వయం ఉపాధి పథకాలలో భాగంగా అర్హులైన ఎస్సీ యువతి, యువకులు ఆన్‌లైన్ (https://tgobmms.cgg.gov.in/�) ద్వారా మార్చి 17 నుండి మార్చి 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రధాన వివరాలు:

రవాణా (Transport): 193 EV రెండు చక్ర వాహనాలు (₹1 లక్ష – 90% సబ్సిడీ, 10% బ్యాంక్ లోన్), 95 EV మూడు చక్ర వాహనాలు (₹3 లక్ష – 70% సబ్సిడీ, 30% బ్యాంక్ లోన్).

వ్యవసాయం (Agriculture): 20 సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు (₹3–7 లక్ష – 60% సబ్సిడీ, 40% బ్యాంక్ లోన్).

శిక్షణ (Training): 77 వేజ్ ఎంప్లాయ్మెంట్ యూనిట్లు, 19 సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ యూనిట్లు – 100% సబ్సిడీ.

అర్హత:

వయసు: వ్యవసాయేతర పథకాలు 21–50 సంవత్సరాలు, వ్యవసాయ ఆధారిత పథకాలు 21–60 సంవత్సరాలు, శిక్షణా యూనిట్లు 18–45, వేతన ఉపాధి 18–35.

వార్షిక ఆదాయం: గ్రామీణ ₹1.50 లక్ష, పట్టణ ₹2 లక్షల లోపు.

EV రెండుచక్ర వాహనాలకు షెడ్యూల్డ్ కుల కుటుంబ సభ్యులు, గిగ్ వర్కర్లు (Zomato, Swiggy, Uber, Rapido) ప్రాధాన్యం.

అవసరమైన ధృవీకరణ పత్రాలు: ఆధార్, తెల్లరేషన్ / ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా కోసం), భూమి ధృవీకరణ (సోలార్ పంప్), SADAREM (దివ్యాంగులు), పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు.

దరఖాస్తు చేసినవి ఆర్జీదారు డౌన్‌లోడ్ చేసి, అవసరమైన ధృవపత్రాలతో కలెక్టర్ కార్యాలయం, రూమ్ నం. F3, 1వ ఫ్లోర్, IDOC, సూర్యాపేటలో సమర్పించాలి. లబ్ధిదారులను జిల్లా స్థాయి కమిటీ ద్వారా ఎంపిక చేస్తారు. గత 5 సంవత్సరాలలో పథకాన్ని పొందిన కుటుంబాలు అనర్హులు.

ఈ అవకాశాన్ని అర్హులు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ. తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.

ప్రచురణాధికారి: జిల్లా పౌర సమాచార అధికారి, సూర్యాపేట.

# త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు – మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 19, ప్రతినిధి: సంగమేశ్వర్ – తెలంగాణా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో జర్నలిస్టుల సమస్యలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, నిజమైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వడం మాత్రమే ప్రభుత్వ లక్ష్యం, ఏవైనా అవగాహన లోపాలు ఉన్నా వాటిని సరిదిద్దడానికి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జర్నలిస్టుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే 252 జీవోలను సవరించి జారీ చేసింది.

మంత్రి చెప్పారు, "డిజిటల్ మీడియా పాలసీ వచ్చే రెండు, మూడు నెలల్లో ఫైనల్ చేయబడనుంది. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇచ్చే అంశంపై కూడా పరిశీలనలు జరుగుతున్నాయి, కోర్ట్ ఆటంకాలు లేకుండా పంపిణీని కృషి చేస్తున్నాం."

అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, ఉద్యోగ భద్రత వంటి అంశాల్లో తెలంగాణ ప్రభుత్వం వెనకడుగు వేయబోదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచిన హితచింతనకు అనుగుణంగా త్వరలోనే ఫలితాలు అందనుందని మంత్రి తెలిపారు

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.